క్లుప్తంగా

శుభకార్యం



పత్తికొండలో వధూవరులతో ఎస్వీ మోహన్‌రెడ్డి

పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు జల్లా సోమశేఖర్, నాగమణి దంపతుల కుమారుడు మధుసూదన్ నాయుడు వివాహం పట్టణానికి చెందిన ప్రీతితో ఆదివారం ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఘనంగా దస్తగిరిస్వామి ఉరుసు



ఊరేగింపుగా గంధం తీసుకెళుతున్న దృశ్యం

తుగ్గలి : మండలంలోని జొన్నగిరిలో దస్తగిరిస్వామి దర్గా ఉరుసు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున తిమ్మనచెర్ల విజయభాస్కర రెడ్డి ఇంటి నుంచి మేళతాళాలతో గంధం ఊరేగింపుగా దర్గాకు తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కులమతాల కతీతంగా భక్తులు దర్గాను సందర్శించి చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉరుసు సందర్భంగా బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది. మిఠాయి, ఆటబొమ్మలు, గాజుల అంగళ్లు, రంగుల రాట్నం, జెయింట్ వీల్, జంపింగ్ స్లైడ్ వంటివి వెలిశాయి. సోమవారం వేకువజామున స్వామి ప్రతిమను ఊరేగిస్తామని ముజావర్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన శేకన్న

ఆలూరు రూరల్: కారు, స్కూటర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఆదివారం మధ్నాహం ఆలూరు సమీపంలోని 133 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ప్రమాదం జరిగింది. వివరాలు.. మండలంలోని కురువళ్లి గ్రామానికి చెందిన శేకన్న, మంజు స్కూటర్‌పై ఆలూరు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ సమయంలో ఆలూరు వైపు నుంచి బళ్లారికి వెళ్తున్న కారు స్కూటర్‌ను వెనుక నుంచి ఢీకొట్టి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో శేకన్న తలకు తీవ్రగాయాలు కాగా మంజు ఎడమకాలు,వీపుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిపించారు. డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం బళ్లారి ఆస్పత్రికి రెఫర్ చేశారు. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు, ముగ్గురు పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు.

స్వెట్టర్ల పంపిణీ



వెల్దుర్తిలో వృద్ధులకు స్వెట్టర్లు అందిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): పట్టణంలోని రహదారుల్లో ఉంటున్న అభాగ్యులకు ఆదివారం వెల్దుర్తి సేవా సమితి, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో స్వెట్టర్లు పంపిణీ చేశారు. చలితో ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, అభాగ్యులకు వాటిని అందజేశామని సంస్థ నిర్వాహకులు హరి నరసింహనాయుడు, చిన్నారులు అర్షద్, అర్షన్ తెలిపారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



దేవరగట్టులో పనులను పరిశీలిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హొళగుంద: దేవరగట్టులో సీసీ రోడ్డు పనులు చురుకుగా సాగుతున్నాయి. హనుమంతరాయ ఆలయం నుంచి డొళ్లిన బండె వరకు పనులు చేపట్టారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 10 లక్షలతో రోడ్డు వేస్తున్నట్లు పీఆర్ ఏఈ యమునప్ప తెలిపారు. రోడ్డు పూర్తయితే భక్తులకు ఇబ్బందులు తీరుతాయని కమిటీసభ్యులు తిమ్మయ్య, మల్లయ్యగౌడ్, మల్లికార్జున, నర్సానాయక్, డాక్యానాయక్, రాజశేఖర్‌గౌడ్ తెలిపారు.

కొత్త ఇంటి కోసం ధ్రువపత్రాలు సమర్పించాలి

మద్దికెర : మండలంలోని గ్రామాల్లో కొత్తగా ఇల్లు నిర్మించుకునే వారు తప్పనిసరిగా ధ్రువపత్రాలు సమర్పించాలని హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భార్యభర్తల ఆధార్ కార్డులు, బ్యాంక్ అకౌంట్ ప్రతులు, రేషన్‌కార్డు పాతది, జాబ్‌కార్డు, ఇంటి పట్టా, ఆదాయ ధ్రువ పత్రం జిరాక్స్ ప్రతులను సంబంధిత సచివాలయంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు అందజేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.





హొన్నూరు కొట్టాల సమీపంలో కొండలో తవ్విన సొరంగ మార్గంలోకి ప్రవేశిస్తున్న తుంగభద్ర దిగువ కాలువ, సొరంగం అవతలి వైపు ప్రవహిస్తున్న ఎల్లెల్సీ

ఎల్లెల్సీ హొయలు

- సుందర మనోహరంగా తుంగభద్ర దిగువ కాలువ ప్రయాణ మార్గం
- ఆకట్టుకుంటున్న హిల్ కటింగ్'
- కట్టిపడేసే ప్రకృతి అందాలు
- అద్భుతంగా కొండలో నుంచి బయటకెళ్లే దృశ్యం



కొండలో నుంచి బయటకొస్తున్న కాలువ



ఎల్లెల్సీ ఒడ్డున పచ్చందాలు.. ఆకట్టుకుంటున్న తాటి చెట్లు

తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) హొళగుంద సెక్షన్ పరిధిలోని హిల్ కటింగ్ దృశ్యాలు అమితంగా ఆకట్టుకుంటున్నాయి. 1950లో తుంగభద్ర జలాశయం నిర్మాణ దశలో ఈ కాలువ తవ్వకం పనులు జరిగాయి. టీబీ డ్యామ్ నుంచి దాదాపు 354 కి..మీ నిడివి ఉన్న కాలువ తవ్వకంలో భాగంగా హొళగుంద సమీపంలో 186వ కి.మీ వద్ద ఆంధ్రా-కర్ణాటక సరిహద్దులో కొండ అడ్డుగా వచ్చింది. దీంతో కొండను భారీ యంత్రాలు, కూలీలతో తొలచి సొరంగం తవ్వారు. అందులో నుంచి తుంగభద్ర నీరు దిగువ కాలువలో ఆంధ్రా వైపు హొయలొలుకుతూ పరుగులు పెడుతున్న దృశ్యాలు సుందర మనోహరంగా ఉంటాయి. యువకులు, విద్యార్థులు, స్నేహితులు ఇక్కడికొచ్చి కాలక్షేపం చేసి వెళ్తుంటారు. సొరంగం పరిసరాలు వీక్షకులను అబ్బుర పరుస్తాయి. కొండను దాటడానికి సిమెంట్ రోడ్డు కూడా వేశారు. దిగువన కనుచూపు మేర పచ్చని పంట పొలాలు, కొండలు, పక్షుల కిలకిలలు, సొరంగంలో నిశ్శబ్దంగా పారుతున్న తుంగభద్ర నీరు, చుట్టూ ఆహ్లాదకర పరిసరాలతో మరో లోకంలో ఉంటున్నామా అనే అనుభూతి కలుగుతుంది. అంతేగాక హిల్ కటింగ్‌పై వెలసిన కణివే పోతప్ప ఆలయంతో పాటు నాగప్ప కట్టను సమీప గ్రామాలకు చెందిన భక్తులు కొలుస్తారు. ఈ ప్రదేశం పర్యాటకానికి అనువుగా ఉంటుంది. అయితే రాత్రి పూట ఈ మార్గంలో తిరగడానికి అనువుగా ఉండదు. – హొళగుంద

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి

కృష్ణగిరి: గ్రామాల్లో జాతరలు, ఉత్సవాలను ప్రజలంతా ఐకమత్యంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ మల్లికార్జున గ్రామస్తులకు సూచించారు. మండలంలోని పెనుమాడ గ్రామంలో ఆదివారం రాత్రి ఆయన గ్రామస్తులకు పలు సూచనలు చేశారు.

గ్రామంలో ఈ నెల 10,11 తేదీల్లో దేవర ప్రశాంతంగా జరిగేలా గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఉత్సవాల ముసుగులో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళమల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. సుప్రభాత సేవ, జలాభిషేకం, కుంకుమార్చన, భండారార్చన, పుష్పార్చన, మహామంగళారతి, ఆకు పూజ, నైవేద్యం సంతర్పణ పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు స్థానిక ఆస్పరి మఠంలో అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ

ఆస్పరి: రామతీర్థం క్షేత్రంలో అయ్యప్ప మాలధారులు ఆదివారం అయ్యప్ప స్వామి మండల పూజ ఘనంగా నిర్వహించారు. వేదపండితులు అనిల్ కుమార్‌స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి గంగ పూజ, గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప స్వామి హోమం, పడి పూజ, భజన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

వేడుకగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

నృత్యం చేస్తున్న చిన్నారి,పాల్గొన్న భక్తులు

మద్దికెర : స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో షష్ఠి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగింశారు. ఉదయం స్వామి, శ్రీవల్లి, దేవసేన ఉత్సవ మూర్తులను అలంకరించి కల్యాణం జరిపించారు. పండితుల వేదమంత్రోచ్ఛాణల నడుమ శాస్త్రోక్తంగా జరిగిన వేడుకను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి స్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ ఆవరణలో ప్రదక్షిణలు చేపట్టారు. కార్యక్రమంలో పత్తికొండ ఎమ్మెల్యే కేయి శ్యాంబాబు, ఎమ్మెల్సీ మధుసూదన్, ఎంపీపీ అనిత, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు. రాత్రి తెనాలి, రాయలసీమ కళాకారులు నాటకం ప్రదర్శించారు.

ఘనంగా అడ్డ పల్లకోత్సవం



అడ్డ పల్లకీలో పట్టదయ్యస్వామిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

హాలహర్వి: మండలంలోని జె.హొసళ్లి గ్రామంలో లక్ష దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రీ పట్టదస్వామి అడ్డపల్లకీ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ఆకు పూజ, పంచామృతాభిషేకం, జలాభిషేకం, గంగపూజ తదితర పూజలు జరిపించారు. సాయంత్రం స్వామివారికి మంగళహారతులు పట్టారు. ఈ సందర్భంగా కోలాటం, నందికోలు తదితర కార్యక్రమాలు అలరించాయి. అనంతరం స్వామివారి అడ్డపల్లకీని ఊరేగించారు. కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. పీఠాధిపతి శంభులింగస్వామి దైవ సందేశాన్ని వినిపించారు. సోమవారం శ్రీ పట్టదస్వామి లక్ష దీపోత్సవ కార్యక్రమం జరుగుతుందని శంభులింగస్వామి తెలిపారు.

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న రామాంజనేయులు

ఆస్పరి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, నారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామంలో సీపీఎం నాయకుడు బాలకృష్ణ అధ్యక్షతన సీపీఎం 7వ మండల మహాసభ నిర్వహించారు. ముందుగా పార్టీ సీనియర్ నాయకుడు మాణిక్యప్ప జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. ఆలూరు నియోజకవర్గంలో సాగునీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా ప్రకృతి వైపరీత్యాలతో రైతులు పంటలు కోల్పోయి నష్టాల పాలవుతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకునే నాథుడే లేడన్నారు. వేదావతి ప్రాజెక్టు నిర్మించి సాగు, తాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, వీరశేఖర్, మల్లేష్, చిన్న సుంకన్న, నరసింహులు, మహేశ్వరీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా బాలకృష్ణతో పాటు 9 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

మానవాళికి మార్గదర్శి భగవద్గీత



విజేతలను సన్మానిస్తున్న డాక్టర్ ఐ.శ్రీదేవి తదితరులు

కర్నూలు(సెంట్రల్): మానవాళి జీవన విధానానికి మార్గదర్శి భగవద్గీత అని, జీవితంలోఎదురయ్యే ఒడిదుడుకలను ఎలా అధిగమించాలో భగవద్గీతలో సంపూర్ణంగా పొందుపరచారని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి పేర్కొన్నారు. ఆదివారం టీజీవీ కళాక్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్యం నుంచే భగవద్గీత పఠనంపై ఆసక్తి పెంచుకుంటే భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కోగలరని పేర్కొన్నారు.

విజేతలు వీరే..

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో 6-7 తరగతుల విభాగంలో విజేతగా జే.కృష్ణ, ద్వితీయస్థానంలో పవన్ కుమార్, తృతీయస్థానంలో పి.వీక్షశ్రీ, 8-9 తరగతుల విభాగంలో విజేత భువనశ్రీ, ద్వితీయ స్థానంలో శ్రీనిధి, తృతీయ స్థానంలో శ్రీనిత్య నిలిచారు. అలాగే 18 సంవత్సరాల పైబడిన వారి విభాగంలో విజేత ఎం.సంగీత, ద్వితీయ స్థానంలో బి.అపర్ణ, తృతీయ స్థానంలో జి.శివన్న, 18 సంవత్సరాల్లోపు విభాగంలో విజేత బి.నాగశర్వాణి, ద్వితీయ స్థానంలో సి.తరుణి నిలిచారు. విజేతలకు రూ.1000, ద్వితీయ స్థానం వారికి రూ.750, తృతీయస్థానం వారికి రూ.500 నగదుతోపాటు ప్రశంసా పత్రాన్ని అందించారు. విద్యార్థులందరికీ శ్రీమద్రాయణ సంగ్రహం గ్రంథాలను అందజేశారు. పోటీలకు హాజరైన వారికి తరిగొండ వెంగమాంబ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పసుపులేటి నీలిమ ఆధ్వర్యంలో మహాప్రసాదం అందించారు. డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, అధ్యాపకులు వరలక్ష్మి, గరుడాద్రి వనజకుమారి, ఎ.శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జె.హొసళ్లికి ఎమ్మెల్యే రాక

హాలహర్వి: మండలంలోని జె.హొసళ్లి గ్రామంలో సోమవారం ఉదయం జరిగే లక్ష దీపోత్సవ కార్యక్రమంలో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉదయం గ్రామానికి చేరకుంటారని చెప్పారు.

వాహనాల తనిఖీ

హొళగుంద: మండల కేంద్రం శివారులోని బళ్లారి రోడ్డులో ఆదివారం రాత్రి ఎస్ఐ బాలనరసింహులు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించి ఆర్‌సీ, ఇతర రికార్డులను పరిశీలించారు. ఓవర్ లోడ్‌తో పాటు నిబంధనాలకు విరుద్ధంగా తిరుగుతున్న, సరైన రికార్డులు లేని వాటితో పాటు మద్యం సేవించి నడుపుతున్న వాహనదారులకు జరిమానా విధించారు. నిబంధనల మేరకు ప్రయాణీకులను ఎక్కించుకోవాలని, ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ ధరించాలని లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్థిక సాయం

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89లో పదవ తరగతి పూర్వ విద్యార్థులు నాటి తమ తోటి అభ్యాసకురాలిని ఆదుకున్నారు. ఇటీవల ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశంలో క్లాస్‌మెంట్స్‌లో ఒకరైన తంబల రాజేశ్వరి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్లు వీరి దృష్టికి వచ్చింది. దీంతో వీరందరూ ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని తలచారు. వెంటనే తలా కొంత మొత్తాన్ని జమచేసి రూ. 20వేలను ఆదివారం వెల్దుర్తిలో ఆమెకు అందజేశారు. 35 ఏళ్ల క్రితం నాటి మిత్రులు ఇలా సాయం చేయడంతో ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక సాయం అందజేసిన వారిలో హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షులు హరి నరసింహనాయుడు, శ్యామల, సువరణ, భారతి, షేక్షావలి, బ్రహ్మానందరెడ్డి, బషీర్ అహ్మద్, పామయ్యయాదవ్, జయన్న ఆచారి ఉన్నారు.

తైక్వాండో శిక్షణ శిబిరం ప్రారంభం

కర్నూలు (టౌన్): విద్యార్థి దశలో తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడలు అవసరమని న్యాయవాది శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం కొండారెడ్డి బురుజు సమీపంలోని కేఎంసీ పార్కులో ఉచిత తైక్వాండో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మరక్షణ కోసం బాలికలు మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల్లో రాణించాలన్నారు. ఒలింపిక్ క్రీడగా గుర్తింపు ఉన్న తైక్వాండో క్రీడలో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉదయం, సాయంత్రం తైక్వాండోలో ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. చిన్నారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఉషూ పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): నగరంలోని కిడ్స్ వరల్డ్ కమ్యూనిటీ హాలులో ఆదివారం 7వ జిల్లా స్థాయి ఉషూ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టీ.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అండర్-12, అండర్-15, అండర్-18 విభాగాల్లో బాల బాలికలకు ఉషూ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అపార్ సమస్యలను పరిష్కరించాలి

ఆదోని సెంట్రల్: అపార్ ఐడీ నమోదులో సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ సీనియర్ నాయకులు బి.సత్యన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ భవనంలో సంఘం మండల అధ్యక్షుడు సి.రామకృష్ణ అధ్యక్షతన ఆదోని, కొత్తాళం మండల నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ విద్యార్థుల అధార్‌లో ఇబ్బందులను తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, పాఠశాలల్లోనే మొబైల్ ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్టీయూ అకాడమిక్ కమిటి సభ్యులు మహదేవప్ప మాట్లాడుతూ ఎస్‌జీటీ సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలన్నారు. పదోన్నతి ద్వారా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు.

అద్భుతం..అరుణోదయం



అందాలను ఆవిష్కరించడంలో ప్రకృతిని మించిన చిత్రకారుడు లేరు. సూర్యోదయం, అస్తమయ సమయంలో ఆకాశంలో అందాలు ఎంతో అద్భుతంగా కనువిందు చేస్తాయి. ఆలూరులో ఆదివారం ఉదయం మంచు తెరలను చీల్చుకుంటూ భానుడు ప్రకాశిస్తున్నప్పటి దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేశాయి. అరుణ వర్ణంలో ఉదయిస్తున్న సూర్యుడు సెల్‌ఫోన్ టవర్‌కు పెద్ద టార్చ్‌లా ప్రకాశిస్తున్నట్లు గోచరించిన దృశ్యం ఆకట్టుకుంది. – ఆలూరు రూరల్

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత, ప్రముఖులు

ఆదోని అర్బన్: పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ పాఠశాలలో ఆదివారం నటరాజ్‌స్వామి అధ్యక్షతన డాక్టర్ జి.నల్లారెడ్డి రచించిన నల్లారెడ్డి శతకం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పుస్తకంలో భాష, సమాజం, సంస్కృతి, ఆధ్యాత్మికతకు సంబంధించిన అంశాలు ఎన్నో ఉన్నాయని, ఈ పుస్తకం సంఘ సంస్కరణ, నైతికతకు సమాజ నిర్మాణానికి ఎంతగానో ఉపయోగపడుతుందని వక్తలు హుసేనప్ప, రిటైర్డ్, తహసీల్దార్ షేక్షావలి, యువ రచయిత సద్దాంహుసేన్, శంకరప్ప ఆచారి తదితరులు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది తాయన్న, అభినవ అన్నపూర్ణేశ్వరి సుజాతమ్మ, హనుమాన్‌సింగ్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

తొలకరి జల్లులు పుస్తకావిష్కరణ

పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబదహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్య వేత్త, బాలబంధు గద్వాల సోమన్న రచించిన 58వ పుస్తకం తొలకరి జల్లులు పుస్తకావిష్కరణ ఆదివారం చిత్తూరులోని విజయం డిగ్రీ కళాశాలలో హరివిల్లు లలిత కళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. గౌరవ అధ్యక్షుడు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, సభా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కృతి స్వీకర్త వల్లేరి హరినాయుడు, విశ్రాంత అటవీశాఖ అధికారి ఎల్ కృష్ణారెడ్డి, విశ్రాంత జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్‌పిళ్లై పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ వల్లేరి హరినాయుడు దంపతులకు ఈ పుస్తం అంకితం ఇచ్చారు. కార్యక్రమంలో గద్వాల సోమన్నను వారు ఘనంగా సన్మానించి. అభినందించారు.

యేసుక్రీస్తు లోకానికి వెలుగు



నృత్యం చేస్తున్న చిన్నారులు

కర్నూలు న్యూసిటీ: క్రీస్తు ఈ లోకానికి వెలుగుగా వచ్చాడని పాస్టర్ వరప్రసాద్ రావు అన్నారు. నగరంలో ఎస్‌పీజీ క్రైస్టు చర్చిలో ఆదివారం సండే స్కూల్, యూత్ క్యాండిల్ లైట్ సర్వీస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజలు క్రీస్తు బోధనలను జీవితాల్లో అలవర్చుకుంటే శాంతి కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు, నాటికలు కనువిందు చేశాయి. క్రిస్మస్ తాత పిల్లలకు బహుమతులు, చాక్లెట్లు పంచారు. పాస్టర్లు రవికుమార్, కరుణాకర్‌లు, పెర్సీ ఇమ్మాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.

దారంతా మురుగే!



ఈ ప్రదేశం మారుమూల గ్రామంలో అనుకుంటే పొరబడినట్లే.. ఎందుకంటే ఇది మండల కేంద్రమైన కృష్ణగిరిలో.. అదీ ప్రధాన రహదారికి సమీపంలోనే. ఇలా రహదారి మొత్తం మురుగుమయంగా మారింది. ఈ దారిలో కనీసం నడవడానికి కూడా సాధ్యపడదు. కస్తూర్బా పాఠశాల సమీపంలో ఉండే ఈ రోడ్డుపై ఓ ప్రైవేట్ పాఠశాలకు, బీసీ కాలనీలోని కొన్ని ఇళ్లకు వెళ్లాల్సి ఉంది. అయితే వేరే దారిలేక, గత్యంతరం లేక స్థానికులు, విద్యార్థులు నిత్యం ఈ మురుగు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రభుత్వం గ్రామాల్లో సీసీ రహదారులు నిర్మిస్తున్నామని చెబుతున్నా ఇలాంటి దారులు దర్శనమిస్తూనే ఉన్నాయి. నిత్యం మండల అధికారులు ఈ రహదారి వైపు చూస్తున్నా చర్యలకు పూనుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – కృష్ణగిరి